
# సాక్షి
## విజయనగరం

ఆదివారం । 12 । మే । 2024



**సకల సౌకర్యాలు**

భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానా శ్రయం నిర్వాసితులకు ప్రభుత్వం సకల సదుపాయాలతో కాలనీలు నిర్మించింది. - 8లో



**ఆపదలోనూ అండగా..**

కరోనా కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగింది. - 8లో



**ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు** - 8లో

ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించారు.

## న్యూస్‌రీల్

### మెట్టపల్లిలో పింక్ పోలింగ్ స్టేషన్

- అక్కడ పోలింగ్ సిబ్బంది అంతా మహిళలే
- పింక్ రంగులో దర్శనమిస్తున్న 165వ పోలింగ్ కేంద్రం



చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలోని 165వ పోలింగ్ కేంద్రం వద్ద పింక్ రంగు స్వాగతం బోర్డులు

**చీపురుపల్లి:** సాధారణంగా పోలింగ్ కేంద్రం పేరు వింటుంటాం. పింక్ పోలింగ్ స్టేషన్ పేరు ఎప్పుడైనా విన్నారా.. కొత్తగా అనిపిస్తోంది కదా.. ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన ఎన్నో మార్పుల్లో భాగంగా అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రాలను పింక్ కేంద్రాలుగా గుర్తించింది. చీపురుపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉన్న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లిలోని 165వ పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో మొత్తం 804 మంది ఓటర్లు ఉండగా అందులో అత్యధికంగా 525 మంది ఓటర్లు మహిళలే. దీంతో ఎన్నికల అధికారులు పింక్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రంలో అందరూ మహిళా సిబ్బందే విధులు నిర్వర్తిస్తారు. పోలింగ్ కేంద్రానికి ముందు భాగంలో పింక్ రంగులు, పింక్ రంగు ఫ్లెక్సీలతో స్వాగతం బోర్డులు, పోలింగ్ కేంద్రంలో సిబ్బంది కూర్చునే కుర్చీలు నుంచి సర్వత్రా పింక్ రంగులోకి మార్చేశారు.



పింక్ రంగులో పోలింగ్ కేంద్రం లోపలి భాగం

### కుక్కల దాడిలో వృద్ధురాలి మృతి



బంటు లక్ష్మి(ఫైల్)

**జియ్యమ్మవలస:** పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు బంటు లక్ష్మి (73)పై కుక్కలు దాడి చేయడంతో శనివారం మృతి చెందింది. బహిర్భూమికి వెళ్లిన ఆమెపై ఐదు కుక్కలు ఒకేసారి దాడిచేసి తలను చిందరవందర చేశాయి. శరీరమంతా గాయపరిచాయి. దూరం నుంచి గమనించిన ఓ వ్యక్తి దగ్గరకు వచ్చి చూసి బిగ్గరగా అరవడంతో గ్రామం నుంచి కొంతమంది వ్యక్తులు పరుగున వచ్చినప్పటికీ అప్పటికే వృద్ధురాలి శరీరమంతా కుక్కలు గాయపరచడంతో ఆమె అక్కడిక్కడే మృతిచెందింది. వారం రోజుల్లో గ్రామంలోని ముగ్గురు మహిళలపై కుక్కలు దాడిచేసినట్టు గ్రామస్తులు తెలిపారు. కుక్కల దాడితో బయటకు వెళ్లేందుకు గ్రామస్తులు భయపడుతున్నారు.

# కదిలిన మహిళా దండు



చీపురుపల్లి మెయిన్‌రోడ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల భారీ ర్యాలీ

- చీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ
- ర్యాలీకి పోటెత్తిన మహిళలు
- హాజరైన ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

**చీపురుపల్లి:** వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణకు మద్దతుగా మహిళలు, పట్టణ ప్రజలు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. లావేరురోడ్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ శ్రీకాకుళం రోడ్, మూడు రోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్, గాంధీబొమ్మ జంక్షన్, కస్పా వీధి వరకు సాగింది. జై జగన్, జై బొత్స నినాదాలతో పట్టణం మార్మోగింది. జగనన్నకే మా మద్దతు అంటూ నినదించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ప్రజలు

# ‘నవరత్నాలను’ చేజార్చుకోవద్దు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే నవరత్నాల ప్లస్ పథకాలు సాధ్యం
- అవ్వాతాతలకు ఇంటివద్దే పింఛన్ అందాలంటే జగనే మళ్లీ రావాలి
- విశాఖ పరిపాలనా రాజధానిగా ఉత్తరాంధ్ర దశదిశా మారుతుంది
- ఎవరు మేలు చేస్తారో ప్రజలు విజ్ఞతతో ఓటేయండి
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019 మేనిఫెస్టోలో హామీలను 99 శాతం అమలు చేశారని, టీడీపీ నాయకుల ప్రలోభాలకు లొంగి నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలను చేజార్చుకోవద్దని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. 2024 మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలు ప్లస్ పథకాలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ఎవరు మేలు చేస్తారో విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు పిల్లల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని చెప్పారు. విజయనగరంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వంలో షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఉత్తరాంధ్ర పరిధిలో మూడు సిద్ధం సభలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోఉన్న 19 మంది శాసనసభ స్థానాలు, ఐదు లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహించినట్లు చెప్పారు.

**● వ్యత్యాసం ప్రజలు గమనించాలి...**

2014–19 సంవత్సరాల మధ్యలో చంద్రబాబు పరిపాలనతో పోలిస్తే 2019–2024 కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ఎంతో వ్యత్యాసం ఉందని మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. చంద్రబాబు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, మేనిఫెస్టోను ఆన్‌లైన్ నుంచి మాయం చేశారని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి 2019 మేనిఫెస్టోలో హామీలను 99 శాతం అమలుచేశారని చెప్పారు. 2024లో కూడా ప్రజలందరి ఆశీస్సులు, దేవుని దయతో అధికారంలోకి వస్తే నవరత్నాలతో పాటు మేనిఫెస్టోలో ఉన్నవన్నీ అమలు చేస్తారని చెప్పారు. ఆ విశ్వాసం, నమ్మకం ప్రజల్లో కనిపించిందన్నారు. విద్యా, వైద్య రంగాల్లో జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు కొనసాగిస్తూ పిల్లల భవిష్యత్తునూ ముఖ్యమంత్రే చూసుకుంటున్నారన్న భరోసా ఉందన్నారు. సంక్షేమ పథకాలు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా తమకు అవినీతి, మధ్యవర్తులు, దళారులు లేకుండా అందాయని ప్రజలు సంతోషంతో చెబుతున్నారని వివరించారు. కచ్చితంగా ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో నూటికి నూరుశాతం మొగ్గు వైఎస్సార్ సీపీ వైపే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారు..**

ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు రెండు పార్టీల మధ్య కాదని, పేదలకు, పెత్తందార్ల మధ్యనని అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని మజ్జి శ్రీనినవాసరావు గుర్తు చేశారు. పేదలపట్ల టీడీపీ నాయకులకు ఎంతటి ఉక్రోషం ఉందో, వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకోవడానికి పెత్తందారుల ఆలోచనలు ఏవిధంగా ఉన్నాయో కళ్లముందు కనిపిస్తున్నాయన్నారు. వారి ప్రలోభాలకు లొంగకుండా మేలు చేసే వారికే విజ్ఞతతో ఓటు వేసి ఆ పెత్తందార్లకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

**● వారి అబద్ధాలను నమ్మవద్దు...**

టీడీపీ కూటమి నాయకులు ఊరూరూ తిరుగుతూ చెబుతున్న అబద్ధాలను నమ్మవద్దని ప్రజలను మజ్జి శ్రీనివాసరావు కోరారు. కుట్రలు, మోసాలతో మభ్యపెట్టేందుకు రకరకాల ప్రచారాలు సాగిస్తున్నారని చెప్పారు. కొన్ని టీవీ చానల్స్, పత్రికలు ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ తమ ప్రభుత్వం పట్ల విషం చిమ్ముతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు.

**ఉత్తరాంధ్రకు మేలిమలుపు...**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, విభజన తర్వాత ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు కానీ ఉత్తరాంధ్రకు ఏమీ చేయలేదని, కనీసం ఇక్కడి ప్రజల ఓట్లతో ఉన్నత పదవులు పొందిన టీడీపీ నాయకులకు ఆలోచన కూడా రాలేదని మజ్జి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తానన్నారని చెప్పారు. ఇలాంటి అవకాశం ఉత్తరాంధ్ర ప్రజలకు ఏనాడు రాలేదన్నారు. యువకులు, ఉద్యోగస్తులు, మేధావులు విజ్ఞతతో ఆలోచించాలన్నారు. ఉత్తరాంధ్ర అంటేనే పోరాటాల గడ్డ అన్నారు. ఆ స్ఫూర్తితో ఉత్తరాంధ్రకు మేలు చేసే నిర్ణయం ఓటు ద్వారా తీసుకోవాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి అధికారంలోకి వస్తే శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు, విజయనగరం జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి అవుతాయని, విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని చెప్పారు. గోదావరి జలాలను మన జిల్లాలకు తీసుకొచ్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కూడా సాకారమవుతుందన్నారు. మంచి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయన్నారు. ఈ దృష్ట్యా జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలబడాలని, వైఎస్సార్ సీపీని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

## ముగిసిన ప్రచార హోరు

పోలింగ్‌కు ఒక్కరోజే మిగిలి ఉంది. అభ్యర్థుల ప్రచారాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. మైకులన్నీ మూగబోయాయి. ఇన్నాళ్లు ప్రచారంలో మునిగితేలిన అభ్యర్థులు రిలాక్స్ అయ్యారు. చివరిరోజు ప్రచారంతో ఊరు/వార్డులు హోరెత్తాయి. అభ్యర్థులు భారీ ర్యాలీలు నిర్వహించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



విజయనగరం మార్కెట్‌లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వ్యాపారులను అభ్యర్థించారు.



రేగిడి మండలం బాలకవివలస గ్రామస్తులు వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో ఆయనతో కలిసి అడుగుకలిపారు.



బొబ్బిలి మండలం అలజంగిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పాలనకు ఓటుతో ఆశీర్వదించాలని అభ్యర్థించారు.



డెంకాడ మండలం నాతవలస వాసులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సాదర స్వాగతం పలికారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యేకు పూలమాలతో సత్కరించి గెలుపు భరోసా ఇచ్చారు.

# ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ వెలుగులు



ఉచిత విద్యుత్ పొందుతున్న రామభద్రపురం దిగువ హరిజన వీధిలోని ఇళ్లు

- 200 యూనిట్ల వరకు ఉచితం
- ఐదేళ్లుగా ఉచిత విద్యుత్ సరఫరా
- వేలాది కుటుంబాలకు లబ్ధి
- ఆనందంలో దళిత కుటుంబాలు

**రామభద్రపురం:** గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ వెలుగులు నింపుతాం.. ప్రతీ ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తూచా తప్పకుండా అమలుచేశారు. ఎస్సీ, ఎస్టీల ఇళ్లలో విద్యుత్ వెలుగులు నింపారు. వచ్చే ఐదేళ్లూ ఈ వెసులబాటు కొనసాగుతుందని మేనిఫెస్టోలో పొందుపరిచారు. దీంతో జిల్లాలో వేలాది కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కేవలం బొబ్బిలి నియోజకవర్గంలోనే 16వేల కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి.

**చెప్పారంటే చేస్తారంతే...**



ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన గత ప్రభుత్వం మోసం చేసింది. వంద యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ప్రతినెలా సకాలంలో బిల్లులు చెల్లించకపోతే అపరాధ రుసుం చెల్లించాల్సి వచ్చేది. ఆలస్యమైతే కనెక్షన్లు తీసేస్తాం అని విద్యుత్ అధికారులు బెదిరించేవారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఉచితంగా విద్యుత్ సరఫరా చేసి మాట నిలబెట్టుకున్నారు. ఏ రోజు ఉచిత విద్యుత్ సరఫరా చేసున్నట్టు చెప్పుకోలేదు. ఆయన చెప్పారంటే చేస్తారంతే.

– గౌరమ్మ, రొంపల్లివలస, రామభద్రపురం మండలం

**సంతోషంగా ఉంది**



జగమోహన్‌రెడ్డి పాద యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి 200 యూనిట్ల వరకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ ఉచితంగా సరఫరా చేశారు. దాంతో విద్యుత్ బిల్లుల బాధ తప్పింది. వచ్చే ఐదేళ్ల ఉచిత విద్యుత్ పథకం కొనసాగించేందుకు మేనిఫెస్టోలో పొందుపరచడం చాలా సంతోషంగా ఉంది.

– ముదిలి మజ్జి గౌరు, రొంపల్లి

# మల్లిలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**సీతంపేట:** మండలంలోని మల్లి పీటీజీ గురుకుల బాలుర పాఠశాలలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో బ్యాక్‌లాగ్ సీట్లు 80, 4వ తరగతిలో 29, ఐదులో 2, ఆరోతరగతిలో 5, ఏడు, ఎనిమిది తరగతుల్లో 6 చొప్పున, 9 వతరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని. వచ్చేనెల 5వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నామని వివరించారు. సీతంపేట, కారిగూడలలో ఉన్న మినీ గురుకుల పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బన్సల్ తెలిపారు. కారిగూడలో 1వ తరగతిలో 30, ఐదో తరగతిలో మిగులు సీటు 1, ఆరోతరగతిలో 3, ఏడో తరగతిలో 1 సీటు ఖాళీగా ఉన్నాయన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- ఎస్పీ ఎం.దీపిక



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక

**విజయనగరం అర్బన్:** జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని జిల్లాలోని శతశాతం ఓటింగ్ నమోదుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఎస్పీ దీపికతో కలిసి కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను వివరించారు. ఇప్పటికే 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందన్నారు. పీడబ్ల్యూడీ ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఓటర్ గైడ్‌లను పంపిణీ చేశామన్నారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 40 శాతం వైకల్యం దాటిన విభిన్న ప్రతిభావంతులకు హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించామని, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది అందరికీ పోస్టల్ ఓటింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. జిల్లాలో 15,62,921 మంది ఓటర్లు ఉన్నారని, 1847 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు, అవసరమైన కుర్చీలు, బూత్‌ల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలోని 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. దివ్యాంగులు, యువత, మహిళల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఆదివారం ఉదయం నుంచే ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎన్నికల సామగ్రిని తరలించేందుకు వినియోగించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 716 వీల్ చైర్లను సైతం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తున్నామని వివిధ వేదికల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా 1,136 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం ఐదుగురితో కలిసి ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చన్నారు. పోలింగ్ ఏజెంట్లను నియమించే అవకాశం కేవలం అభ్యర్థికి లేదా ఎలక్షన్ ఏజెంట్‌కు మాత్రమే ఉందని చెప్పారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం 3 గంటలు తరువాత పోలింగ్ బూత్‌లలో ఏజెంట్స్ మారేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో జిల్లాలో సుమారు 80 శాతం ఓటింగ్ నమోదయిందని, ఈ ఏడాది మరింత ఎక్కువ నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

● జిల్లాలో ఎన్నికల బందోబస్తుకు జిల్లా పోలీసులు, రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలను వినియోగిస్తున్నామని ఎస్పీ ఎం. దీపిక చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఇప్పటికే పోలీస్ దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని, అవగాహన సదస్సులు చేపట్టామని తెలిపారు ఎక్కడైనా అనుకోని సంఘటన జరిగితే కేవలం 5 నిమిషాల్లోనే అక్కడికి చేరుకునేలా ర్యాపిడ్ యాక్షన్ బృందాలను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో లైసెన్సు తీసుకున్న తుపాకులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని, పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా వివిధ చెక్ పోస్టులు, స్క్వాడ్ బృందాల తనిఖీల్లో ఇప్పటి వరకు సుమారు రూ.11.38 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహ పరికరాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు




ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

**విజయనగరం అర్బన్:** ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, సీతారామ్ జాట్ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక కలెక్టరేట్ ఎన్ఐసీలో శనివారం ఈ ప్రక్రియ నిర్వహించారు. అన్ని నియోజకవర్గాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీఓలు, ఏపీఓలు, ఓపీఓలను కేటాయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఈవీఎం నోడల్ అధికారి బి.ఉమాశంకర్, ఎన్ఐసీ డీఐఓ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్‌లో లక్ష్మీపురం వాసి మృతి



ముసలినాయుడు (ఫైల్)

**సీతానగరం:** మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గవర ముసలినాయుడు(సాయి)24 తెలంగాణలోని వరంగల్ బస్‌స్టేషన్ వద్ద టిప్పర్ ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మృతుడి సన్నిహితులు లక్ష్మీపురంలో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ఈ సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముసలినాయుడు జీవనోపాధి నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలోని రామగుండంలో గల ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచాడు. రాష్ట్రంలో సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయడానికి ఊరు వచ్చేందుకు బయల్దేరిన ముసలినాయుడు సన్నిహితులతో కలిసి వరంగల్ బస్‌స్టేషన్‌కు వచ్చాడు. తిరిగి సన్నిహితులంతా కంపెనీకి వెళ్లడానికి అందరూ రోడ్డుపై ఉన్న సమయంలో ఓ టిప్పర్ వారి మీదుగా దూసుకుపోవడంతో ముసలినాయుడితో పాటు మరో సన్నిహితుడు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో ముసలినాయుడు దుర్మరణం చెందినట్లు సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నతల్లి, గోపాలం, చెల్లెలు రాధ భోరున విలపించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కొడుకును కోల్పోయిన వారి రోదన వర్ణనాతీతంగా ఉంది.

### గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**సీతానగరం:** మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన చెందాన అప్పలనాయుడు(68) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అప్పలనాయుడు కొంతకాలంగా కడుపు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ ఫలితంలేకపోవడంతో బాధను తట్టుకోలేక పంటలో కలుపు నివారణకు తెచ్చిన గడ్డిమందు శుక్రవారం సాయంత్రం తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹153 | ₹276 | ₹286 |

# పునరావాస కాలనీల్లో.. సకల సౌకర్యాలు



గూడెపువలస ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వాసితులు నిర్మించుకున్న గృహాలు

- రూ. 30 కోట్లతో మౌలిక సదుపాయాలు
- ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలంతో పాటు రూ.9.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- సంతోషం వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు



గూడెపువలసలో కాలనీలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం



గూడెపువలలో నిర్వాసితురాలు నిర్మించుకున్న ఇల్లు

**భోగాపురం:** మెరుగైన సదుపాయాలతో భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మిస్తున్నారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాలతో సరితూగే విమానాశ్రాన్ని జీఎంఆర్ సంస్థ రూపొందిస్తోంది. విమానాశ్రయం పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు, గృహాలు కోల్పోయిన నాలుగు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచింది. భూములు కోల్పోయిన వారికి పూర్తిగా పరిహారం అందజేయగా..గృహాలు కోల్పోయిన బొల్లింకలపాలెం, రెల్లిపేట, మరడపాలెం, ముడసర్లపేట గ్రామాలకు చెందిన సుమారు 373 కుటుంబాలకు గూడెపువలస రెవెన్యూ పరిధిలోని 17 ఎకరాల్లో.. పోలిపల్లి రెవెన్యూ పరిధి లింగాలవలసలోని 25 ఎకరాల్లో ఇళ్లు నిర్మించింది. విశాలవంతమైన సీసీ రోడ్లు, విద్యుత్, కాలువలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు, శ్మశానవాటికలు, పార్కులు, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు వంటి సకల సదుపాయాలతో పునరావాస కాలనీలు ఏర్పాటు చేసింది. ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఐదు సెంట్ల స్థలంతో పాటు రవాణా చార్జీలతో కలిపి రూ.9.20 లక్షలు చెల్లించింది. దీంతో నిర్వాసితులు ఆయా పునరావాస కాలనీల్లో విశాలమైన ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

### ఎన్నో ప్రయోజనాలు ..



ఎక్కడో మారుమూల ఉన్న మా ప్రాంతం విమానాశ్రయం ఏర్పాటుకు ఇచ్చాం. ప్రభుత్వం మాకు పునరావాస కాలనీ ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించడం అభినందనీయం. గతంలో విద్య, వైద్యానికి నానా అవస్థలు పడే మాకు.. ఈరోజు జాతీయ రహదారికి ఆనుకుని అన్ని సౌకర్యాలు కల్పించారు.

– సబ్బి సూరమ్మ, నిర్వాసితురాలు, మరడపాలెం గ్రామం



లింగాలవలస ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల

### మరో బంజారాహిల్స్..



విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా భూములు, గృహాలు కోల్పోయిన మేము ప్రారంభంలో చాలా బాధ పడ్డాం. అయితే మొదట్లో లింగావలస వద్ద ఇచ్చిన నిర్వాసిత కాలనీ ప్రదేశాన్ని చూసి కొంత బాధ పడ్డాం. ప్రభుత్వం ఈరోజు అదే కాలనీలో విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, గుడి, బడి, పార్కు సూపర్ కాంప్లెక్స్ వంటి సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఈ రోజు కాలనీలో జరుగుతున్న నిర్మాణాలు చూస్తుంటే హైదరాబాద్‌లో ఉన్న బంజారాహిల్స్‌ను తలపిస్తోంది.

– కొండపు నాగరాజు, నిర్వాసితుడు, మరడపాలెం గ్రామం



లింగాలవలసలో నిర్వాసితురాలు నిర్మించుకున్న ఇల్లు

### విశాలమైన ఇల్లు కట్టుకున్నా..



మా ప్రాంతానికి విమానాశ్రయం రావడంతో మా గ్రామానికి మోక్షం కలిగిందని చెప్పొచ్చు. అయితే గ్రామం నుంచి విడదీయరాని బంధం ఉన్నప్పటికీ ఏదో ఒకరోజు గ్రామాన్ని వదిలి పెట్టాలని ముందే అనుకున్నాం. ఈక్రమంలోనే ప్రభుత్వం అన్ని సదుపాయాలతో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసింది. అందులో ప్రభుత్వం ఇచ్చిన 5 సెంట్ల స్థలంలో విశాలవంతమైన గృహాన్ని కట్టుకుని ఈ రోజు సంతోషంగా గడుపుతున్నాం.

– బొల్లింకల తోటమ్మ, నిర్వాసితురాలు, బొల్లింకలపాలెం గ్రామం

# ఈవీఎంల స్వీకరణకు ఏర్పాట్లు

- రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

**విజయనగరం అర్బన్:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన అనంతరం జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికల సిబ్బంది తీసుకువచ్చే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) స్వీకరించేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈవీఎంలు భద్రపరిచేందుకు, ఓట్ల లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు లెండి ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో రాజాం, నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జేఎన్‌టీయూ జీవీలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు ప్రదేశాల్లో వర్షానికి ఇబ్బంది పడకుండా రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక జర్మన్ హ్యాంగర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పది సాధారణ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే అదేరోజు రాత్రి జేఎన్‌టీయూ జీవీలో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే జేఎన్‌టీయూ జీవీ, లెండి ఇంజినీరింగ్ కళాశాలను కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# జగనన్నను మరోసారి గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, పక్కన ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

**బొబ్బిలి:** పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమాన్ని అందించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. పట్టణంలో శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండే ముఖ్యమంత్రికి ప్రజలందరూ అండగా ఉండాల్సిన సమయం వచ్చిందన్నారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకుడు తూముల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అందరూ అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ ఎస్పీ నరేష్‌బాబు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నరేష్‌బాబు

**సాలూరు:** ఎన్నికల వేళ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగరాదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ ఆక్టోపస్ నరేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు శని వారం ఆయన సాలూరు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లో 143 పోలింగ్ లొకేషన్లలో ,193 పోలింగ్ స్టేషన్లను మొత్తం 26 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై, ప్రత్యేక బలగాలు తదితర 350 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రిటికల్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### ప్రమాదంలో జింకకు గాయాలు



పొదల్లో చిక్కుకున్న జింక

**సీతానగరం:** మండలంలోని జోగింపేట గురుకుల విద్యాలయం సమీపంలో ఉన్న తోట గేటును ఢీకొట్టడంతో ఓ జింక బలంగా గాయపడింది. శనివారం సాయంత్రం కొండ నుంచి బయటకు వచ్చిన జింక రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న మామిడి తోటలోకి వెళ్తున్న సమయంలో వాహనాలు తిరుగాడుతుండడంతో కంగారుగా వెళ్లి ఇనుప గేటును ఢీకొట్టి గాయపడింది. దీనిపై స్థానికులు అటవీశాఖ అధికారి సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు.

# ఆపదలోనూ అండగా..



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్



కోవిడ్ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

- కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సకాలంలో వైద్యసేవలు అందడంతో నిలిచిన ప్రాణాలు
- గ్రామాల్లోనే కోవిడ్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 5 లక్షలకు పైగా కోవిడ్ పరీక్షలు
- 38 క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు
- వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం

**విజయనగరం ఫోర్ట్:** కరోనా (కోవిడ్) మహమ్మారి రెండేళ్ల పాటు యావత్ ప్రపంచాన్ని వణికించింది. జ్వరం, జలుబు, దగ్గు వచ్చిందంటే చాలు జనం హడలిపోయేవారు. ఒక ప్రాంతంలో కోవిడ్ కేసు నమోదయితే ఆ ప్రాంతానికి కూడా ఎవ్వరూ వెళ్లేవారు కాదు. ఆ సమయంలో కరోనా లక్షణాలతో ఎంతోమంది మృత్యువాత పడ్డారు. ఇళ్ల నుంచి కూడా బయటకు రావడానికి భయపడుతున్న రోజుల్లో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచింది. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించింది. కోవిడ్ బారిన పడిన వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా అవసరమైన చికిత్సను సకాలంలో అందించింది. దీంతో ఎంతోమంది ప్రాణాలతో బయటపడ్డారు.

**గ్రామస్థాయిలోనే కోవిడ్ పరీక్షలు**

ఎక్కువ మందికి కోవిడ్ పరీక్షలు చేయడం ద్వారా కోవిడ్ వ్యాప్తిని అరికట్టవచ్చుననే ఉద్దేశంతో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామస్థాయిలోనే కోవిడ్ పరీక్షలు చేసింది. దీంతో వ్యాప్తిని తగ్గించగలిగారు. గ్రామాలతో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో పరీక్షలు అధికంగా చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షలకు పైగా కోవిడ్ పరీక్షలు నిర్వహించారు.

**సకాలంలో చికిత్సతో నిలిచిన రోగుల ప్రాణాలు..**

కోవిడ్ నిర్ధారణ అయిన వారికి ఇంట్లో ప్రత్యేకంగా ఉంచి మందులు అందించేవారు. ఎవరి పరిస్థితి అయినా ఆందోళనకరంగా ఉంటే అటువంటి వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలిచాయి.

**38 క్వారంటైన్ సెంటర్లు..**

హోమ్ క్వారంటైన్‌లో చికిత్స పొందే అవకాశం లేని రోగుల కోసం జిల్లాలో క్వారంటైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 108 అంబులెన్సుల ద్వారా రోగులను అక్కడకు తరలించి చికిత్సతో పాటు వసతి అక్కడే కల్పించారు. అదేవిధంగా పౌష్టికాహారం అందించారు. 14 రోజుల తర్వాత ఎంతో మంది మెరుగైన ఆరోగ్యంతో ఇళ్లకు వెళ్లారు.

**ప్రతి ఆస్పత్రిలో ఆక్సిజన్ ట్యాంక్‌లు..**

కోవిడ్ రోగులకు ప్రధాన సమస్య శ్వాస ఆడకపోవడం. వీరికి ఆక్సిజన్ అత్యంత అవసరం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కోవిడ్ రోగులకు చికిత్స అందించే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోను ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయకముందు ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ ద్వారా రోగులకు ఆక్సిజన్ అందించారు. కోవిడ్ పరీక్షలు, చికిత్స, క్వారంటైన్ సెంటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం జిల్లాలో రూ. 50 కోట్ల వరకు ఖర్చు చేసింది.

**ఆర్థికసాయం..**

కోవిడ్ వల్ల ప్రజలు పనులు కూడా చేసుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం నిత్యావసర వస్తువులు అందించింది. అంతేకాకుండా ప్రతి ఒక్కరికీ రూ. 1000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

### ప్రభుత్వమే బతికించింది..

జ్వరం, దగ్గు, ఆయాసం ఉందని కోవిడ్ పరీక్ష చేయించుకుంటే పాజిటివ్ అని వచ్చింది. 108 అంబులెన్స్ ద్వారా జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్‌లో చేరాను. అక్కడ 14 రోజులు పాటు ఉంచి చికిత్స అందించారు. ప్రభుత్వమే నన్ను బతికించింది.

– వేచలపు దేముడు, పెదవేమలి గ్రామం, గంట్యాడ మండలం

# అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

- మీడియాతో కలెక్టర్ నిషాంత్‌కుమార్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

**పార్వతీపురం టౌన్/పార్వతీపురం:** జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ఓటుహక్కును తన అంతరాత్మ ప్రబోధం మేరకు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని కోరారు. యువత, మహిళలు, పీవీటీజీలు, థర్డ్ జెండర్ ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్నికలకు ఇప్పటివరకు అన్ని ఏర్పాట్లు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని చెప్పారు.

**జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్**

జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి 144వ సెక్షన్ అమల్లోకి వస్తుందన్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని, ఇంటింటి ప్రచారంలో లౌడ్ స్పీకర్ల వినియోగం లేదా ఎక్కువ మందితో ప్రచారం పాల్గొనడం నిషేధమని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలను మూసివేయించారు. ఇది 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు వర్తిస్తుందని వివరించారు. జిల్లాలో 604 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, రెండు కోట్ల రూపాయల విలువైన 61 వేల మద్యం సీజ్ చేశామని, 2019 ఎన్నికలలో సీజ్ చేసిన దానికి ఇది పది రెట్లు అని వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఎవరూ జిల్లాలో ఉండరాదన్నారు. నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్నవారు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. లాడ్జిలు, వసతి అతిథి గృహాలను తనిఖీ చేస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధి వరకు మాత్రమే వాహనాలను అనుమతించనున్నట్లు చెప్పారు. ఓటరు సహాయానికి వేసే తాత్కాలిక టెంట్లు రెండు వందల మీటర్లు తరువాత మాత్రమే వేయాలని, అక్కడ పార్టీల జెండాలు, గుర్తులు, ప్రచారం ఉండరాదని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సహాయకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.